క్లుప్తంగా

బడ్డీకొట్టు అందజేత



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని వైఎస్‌ఆర్ చారిటీస్ అధ్యక్షుడు యలమంచలి జయప్రకాష్ ఆదివారం 5వ డివిజన్‌లోని క్రీస్తురాజపురంలో నివాసం ఉంటున్న ఆలేటి రమేష్, యశోద దంపతులకు స్వయం ఉపాధి నిమిత్తం బడ్డీకొట్టును అందజేశారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ వైఎస్‌ఆర్ చారిటీస్ ఆధ్వర్యంలో పలు నియోజకవర్గాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదలు, మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం తోపుడు, కూరగాయలు, బడ్డీకొట్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో 5వ డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్, శివ, నీలం, కొండ, చిత్రలోకేష్, రత్నరాజు, సుందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కవి వెంకటేశ్వరరావుకు సత్కారం



రామవరప్పాడు: రాజమహేంద్రవరంలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ తెలుగు మహాసభలలో ప్రసాదంపాడుకు చెందిన కవి పంతుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. పద్య గద్య గేయ రచయితైన వెంకటేశ్వరరావును ఈ కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ సత్కరించారు. పంతుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తన పద్య కలం తపస్వి పేరున నాలుగు శతకాలు ఒక పద్య కావ్యం రచించినట్లు తెలిపారు. శతకం సమాజహితం అంశంపై తన ప్రసంగాన్ని అందించానని తెలిపారు.

కరాటేలో యజ్ఞేశ్వర్‌కు బంగారు పతకం



పెనమలూరు: కరాటే పోటీలో యనమలకుదురులో చదువుతున్న విద్యార్థి యజ్ఞేశ్వర్ బంగారు పతకం సాధించాడు. ఈ మేరకు ఆదివారం వాన్కాన్ కరాటే డో ఫెడరేషన్ చీఫ్ ఎస్.దుర్గారావు జోసెఫ్ మాట్లాడుతూ ఆదివారం తెలంగాణ పరకాలలో 32వ ఇంటర్ స్టేట్ కప్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ -2024 పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో తెలుగు రాష్ట్రాల నుంచి 400 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. యనమలకుదురులో 8వ తరగతి చదువుతున్న ఎస్. యజ్ఞేశ్వర్ వ్యక్తిగత ఎల్లో కలర్ బెల్టు కాటా 13 సంవత్సరాల విభాగంలో బంగారు పతకం సాధించాడన్నారు.

బహుముఖ ప్రతిభాశాలి వసుమతి

విజయవాడకల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి చలసాని వసుమతి అని ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు అన్నారు. చలసాని మధుమతి మాధవ సేవా సాహితీ సమితి ఆధ్వర్యంలో టిక్కిల్‌రోడ్డులోని సమితి కార్యాలయంలో సాహితీవేత్తలు ఎల్ఆర్ స్వామి, ఇంద్రగంటి జానకీబాలలకు వసుమతి జీవన సాఫల్య పురస్కారాలను ఆదివారం ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పూర్ణచందు మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలోని కథ, నవల, అనువాద ప్రక్రియలలో వసుమతి తమ ప్రతిభను చాటుకున్నారన్నారు. రచయితల సంఘం అధ్యక్షుడు సుబ్బారావు వసుమతి సాహితీ సేవలను వివరించారు.

ఉత్సాహంగా...ఉల్లాసంగా...

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. ఆరు దశబ్దాలుగా కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని ఉల్లాసంగా గడిపారు. కళాశాలతో తమకు ఉన్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులు, విశ్రాంత అధ్యాపకులు నెమరవేసుకున్నారు. తొలుత కళాశాల వ్యవస్థాపకులు వేములపల్లి కోదండరామయ్య, లక్ష్మీఅన్నపూర్ణమ్మ దంపతులు, తొలి ప్రిన్సిపాల్ తాతినేని శ్రీనివాసరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీఎల్. ప్రసాద్, నాదెండ్ల బాలమురళీకృష్ణ మాట్లాడారు. ఈ ప్రాంత విద్యాభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని కోదండరామయ్య స్థాపించిన కళాశాల వేలాది మందిని ఉన్నతులుగా తీర్చిదిద్దిందని చెప్పారు. ఇంతటి ఘనచరిత్ర కలిగిన కళాశాలకు పూర్వ విద్యార్థులే పెద్ద అస్తిగా పేర్కొన్నారు. అందుకే పూర్వ విద్యార్థులందరినీ సమన్వయం చేసేందుకు ఏటా ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లుగా చెప్పారు. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సంఘం ద్వారా పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. కళాశాలలో గ్రంథాలయ అభివృద్ధికి, ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహాలు, పేద విద్యార్థులకు ఫీజులు అందించనున్నట్లు ప్రకటించారు. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకురావడం అభినందనీయమని ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు తెలిపారు. పూర్వపు ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణకుమారి, విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ ఎం. విజయకుమార్, గన్నె వెంకట్రావు, డీఎస్ సుబ్బారావు, గాంధీబాబు, శాయోజిరావు, సంఘ కోశాధికారి రాంబాబు, సభ్యులు కొత్తంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వీఎస్ సెయింట్ జాన్స్ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



వీకేఆర్ కళాశాలలో ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సందడి

గన్నవరం: స్థానిక వీఎస్. సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1999లో పదవ తరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత తిరిగి ఒకే వేదికపై కలుసుకున్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొని సందడి చేశారు. పాఠశాలలో కలియ తిరుగుతూ తరగతి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కారించారు.
పూర్వపు ప్రిన్సిపాల్ బ్రదర్ కేఎం. జోసఫ్, ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ బల్లా జోసఫ్, సీనియర్ బ్రదర్లు జిమ్మీ కొరియాకోస్, బ్రదర్ సీజే. థామస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్

నున్న(విజయవాడరూరల్): క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు అన్నారు. నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం నున్న గ్రామంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ ప్రతిభావంతులైన క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని తెలిపారు. స్నేహపూరిత వాతావరణంలో పోటీలు జరగాలని కోరారు. నున్న గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్, సొసైటీ చైర్మన్ పోలారెడ్డి చంద్రారెడ్డి, ఉపసర్పంచ్ కె. బ్రహ్మానందరెడ్డి, సొసైటీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, నిర్వాహకులు నవీన్, శ్రీకాంత్, లోకేష్ క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.25,116, ద్వితీయ బహుమతి రూ.15,116 అందిస్తామని పేర్కొన్నారు. మ్యాన్ ఆఫ్ టోర్నమెట్ క్రికెట్ బ్యాట్ ఇస్తామన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కె.సువర్ణరాజు

దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ

గన్నవరం: దివ్యాంగులకు సేవా చేయడం అదృష్టంగా భావించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ తెలిపారు. మండలంలోని దావాజిగూడెంలో ఉన్న స్పందన మానసిక వికాస కేంద్రంలో ఆదివారం రైతు సంఘం జిల్లా నాయకులు ముక్కామల ఉమామహేశ్వరరావు సౌజన్యంతో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ ముక్కామల తన కుమారుడు వెంకటలక్ష్మీశ్రీనివాస్ 15వ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా స్పందన మానసిక వికాస కేంద్రం ద్వారా దివ్యాంగులకు ఉచిత విద్య, వైద్యం, రవాణా, భోజన సదుపాయం కల్పించడం ప్రశంసనీయమన్నారు. డీఎస్పీ నాదెండ్ల బాలమురళీకృష్ణ, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్, సీపీఐ నేతలు కాట్రగడ్డ రామచంద్రజోషి, శనగల సుబ్బారెడ్డి, కట్టవరపు విజయరావు పాల్గొన్నారు.



దుప్పట్లు అందజేస్తున్న వనజ

జిల్లా స్థాయి క్రికెట్ విజేత పోరంకి

ఉయ్యూరు: క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని వైఎస్సార్ సీపీ ఉయ్యూరు మండల ప్రధాన కార్యదర్శి గారపాటి నాని అన్నారు. మండలంలోని ఆకునూరు గ్రామంలో జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. చలివేంద్రపాలెం స్పోర్ట్స్ క్లబ్ క్రికెట్ టోర్నమెంట్, వైఎస్సార్ సీపీ సంయుక్త ఆధ్వర్యంలో ఉత్సాహ భరితంగా సాగిన పోటీల్లో ఉయ్యూరు , పోరంకి జట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో పోరంకి జట్టు విజేతగా నిలిచింది. జట్టుకు ట్రోఫీతో రూ.1 లక్ష నగదును వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి గారపాటి నాని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ఆడుదాం ఆంధ్రాతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన హరివిల్లు టీమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆరేపల్లి శ్రీను, మెరుగుమాల ఏసుబాబు, మరీదు చంద్రశేఖర్‌రావు, ఆర్గనైజర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు గారపాటి నాని

సూరంపల్లి జెడ్పీ హైస్కూల్లో అగ్ని ప్రమాదం

గన్నవరం రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మండలంలోని సూరంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. పాఠశాల పాత రికార్డులు, ల్యాప్‌ట్యాప్, టీవీ, ఫర్నీచర్ దగ్ధమయ్యాయి. సెలవు దినం కావటంతో పాఠశాల హెచ్‌ఎం, స్టాఫ్ కలసి ఉండే రూములో నుంచి పొగలు రావటంతో స్థానికులు గమనించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అగ్ని ప్రమాద సమాచారం హెచ్‌ఎం హరిశరణ్‌కు అందించారు. ఆయన పాఠశాల వద్దకు వచ్చి ఉన్నతాధికారులకు, గన్నవరం అగ్నిమాపక కేంద్రానికి, పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎంఈవో కొండా రవికుమార్, అగ్నిమాపక సిబ్బంది వచ్చి ప్రమాద ప్రదేశాన్ని పరిశీలించారు. ఎంఈవో రవికుమార్ మాట్లాడుతూ పాత రికార్డులు కాలిపోయాయని తెలిపారు. సీఆర్‌పీ బి.దుర్గాదేవి, ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చి ప్రమాదంలో కాలిపోయిన రికార్డులు, రూమును పరిశీలించారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



పెనమలూరు: రౌడీషీటర్లు క్రమశిక్షణతో మెలగాలని సీఐ టీవీవీ రామారావు అన్నారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు క్రమశిక్షణతో ఉండి, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మెలగాలని సూచించారు. రౌడీషీటర్లు ఉపాధి పై దృష్టి పెట్టి పనులు చేసుకోవాలని సూచించారు. ప్రవర్తనలో మార్పు వస్తే రౌడీషీట్లు తొలగిస్తామని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సమయంలో కోడిపందేలు, పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. లేని పక్షంలో కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జూద శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

కంకిపాడు: సంక్రాంతి పండుగ సందర్భంగా జూద శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. జిల్లా ఎస్పీ పి.జాషువా ఆదేశాలతో గన్నవరం డీఎస్పీ ఆర్.జి.జయసూర్య పర్యవేక్షణలో సీఐ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జూద శిబిరాల నియంత్రణకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశామన్నారు. కోడిపందేలు, పేకాట, గుండాటలు నిర్వహించటం చట్ట వ్యతిరేకమన్నారు. జూద క్రీడల నిర్వహణ నిషేధించామన్నారు. హెచ్చరికలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. చెడు నడత కలిగిన సుమారు 105 మంది వ్యక్తులను ఇప్పటికే బైండోవర్ చేశామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

తెలుగు ప్రజలకు వరం బ్రదర్ జోసఫ్ తంబి

ఉంగుటూరు: తెలుగు ప్రజలకు వరం బ్రదర్ జోసఫ్ తంబి అని విజయవాడ మేత్రాసనం విజయవాడ, గన్నవరం విచారణ గురువులు ఫాదర్ జాన్‌పీటర్, ఫాదర్ పసల థామస్ అన్నారు. ఉంగుటూరు మండలం పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి వర్ధంతి మహోత్సవాల నవదిన ప్రార్థనలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక దివ్య పూజాబలిని సమర్పించారు. శ్రీసభ-క్రైస్తవుల సమూహ ప్రయాణం అనే అంశంపై సందేశాన్ని ప్రసంగించారు. ఎక్కడో పాండిచేరిలో జన్మించి ఆంధ్రప్రదేశ్‌లో పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి స్థిరపడడం తెలుగు ప్రజలకు దేవుడిచ్చిన వరం అని చెప్పారు. అనంతరం గురువులు అందరూ కలసి కతోలిక శ్రీసభ కోసం ప్రత్యేకంగా ప్రార్థించారు. పెద అవుటపల్లి ఫాతిమానగర్ వాసులు స్తుతిగీతాలతో తంబిని కొనియాడారు. రెక్టర్ ఫాదర్ పాలడుగు జోసఫ్ ప్రార్థనలో పాల్గొన్న గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విచారణ ఫాదర్లు అభిలాష్ గోపు, ప్రవీణ్ గోపు, మద్దాల రవి, కచ్చా కిషోర్, దిరిశం జయప్రసాద్ పాల్గొన్నారు.



దివ్య పూజాబలిని సమర్పిస్తున్న ఫాదర్లు

జాతీయ సదస్సుకు సర్పంచ్ శ్రీదేవి ఎంపిక

రామవరప్పాడు: కేంద్ర ప్రభుత్వం ఈనెల 9న ఢిల్లీలోని ప్రవాసీ భారతీయ కేంద్రం, సుష్మా స్వరాజ్ భవన్‌లో 'లింగ ఆధారిత హింస పరిష్కారం' (జీబీవీ) అంశంపై నిర్వహించనున్న జాతీయ సదస్సుకు రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వరి శ్రీదేవి మాట్లాడుతూ ఈ వర్కు షాపులో పాల్గొనేందుకు 8న బయలుదేరి ఢిల్లీ వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో లింగ ఆధారిత హింస పరిష్కారంపై తన ఆలోచనలు, సలహాలను తెలియజేస్తానన్నారు.



రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి

ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు పంపిణీ

ఉంగుటూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ హెల్త్ కార్డులు వలంటీర్లకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో అన్నిరకాల వ్యాధులు చేర్చడంతో పాటు రూ.5 లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల ఉపయోగాలను ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. 3257 పైగా రోగాలకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. కార్డులను ఈఓపీఆర్డీ వైసీ సమోదుతో పంపిణీ చేయాలని వలంటీర్లకు సూచించారు.



కార్డులు పంపిణీ చేసిన దృశ్యం

స్వయంకృషితో ఉన్నత శిఖరాలు

విజయవాడకల్చరల్: గాయనీ గాయకులు స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని హైదరాబాద్‌కు చెందిన సరస్వతీ కళాపీఠం వ్యవస్థాపకురాలు మధిర రోజా ప్రసన్నత సూచించారు. నూతన సంవత్సరం, సంక్రాంతి వేడకల సందర్భంగా సరస్వతి కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సినీ సంగీత విభావరి, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. మధిర రోజా ప్రసన్నత మాట్లాడుతూ గాయనీ గాయకులు నిత్యం పాటలోని సాహిత్యం అధ్యయనం చేయాలని సూచించారు. బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి మాట్లాడుతూ సరస్వతీ కళాపీఠం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విలువలతోకూడిన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. పీసుపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి, కొప్పరపు ఉమాబలరాం, కొమ్మినేని రత్నకుమారి, వడ్డాది కామేశ్వరి తదితరులు శాస్త్రీయ, క్లాసికల్ గీతాలను ఆలపించారు.

160 మందికి వైద్య పరీక్షలు

ఉయ్యూరు: గండిగుంటలోని శ్రీ దత్త ఆశ్రమంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. 160 మంది రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రతినెలా మొదటి ఆదివారం దత్త ఆశ్రమంలో వైద్య శిబిరం నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేనేటింగ్ ట్రస్టీ మంజుల, నిర్వాహకులు పురుషోత్తమాచార్యులు తెలిపారు.



మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది







● అమ్మా.. మనసాస్మరామి

ఇంద్రకీలాద్రిపై ఐదు రోజులుగా జరుగుతున్న భవానీ దీక్ష విరమణలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భవానీలు ఆదివారం తరలివచ్చారు. గిరి ప్రదక్షిణ నిర్వహించి, అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఇరుముడులను సమర్పించారు. దీంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



